# ఓడలు-బళ్లూ

పదిన్నరకు కాప్టన్ జాన్సన్‌తో అప్పాయింటుమెంటు ఉండటంవల్ల రంగారావు చాలా పెందలాడే ఆడావిడిగా ఆఫీసులోకి అడుగుపెట్టాడు. ఆఫీసులో గుమాస్తాలంతా కేకులుతింటూ, టీలు తాగుతూ, నానా అల్లరి చేస్తున్నారు. రంగారావును చూడగానే ఆఫీసంతా సద్దుమణిగింది. యుద్ధం కోసం[1] ఏర్పరచిన ఈ అభాగ్యపు డిపార్టుమెంటుల్లో చదువు సంధ్యల్లో మునిగి ఉండవలసిన కుర్రకారంతా చేరడంవలన పై ఉద్యోగి మీద గౌరవం ఉండటమనేది చాలా అరుదుగా ఉంటుంది. కాని రంగారావెట్లాగో తన కింద పనిచేసేవాళ్ళ గౌరవానికి పాత్రుడు కాగలిగాడు. వాళ్ళకెంతో స్వేచ్ఛ ఇచ్చి కూడా వాళ్ల భయభక్తులు సంపాదించుకున్నాడు. అతని అలవాట్లన్నీ గుమాస్తాలందరికీ తెలుసు. అతను పెందలాడే వచ్చాడంటే త్వరలోనే మళ్ళీ బయటికి వెళ్ళతాడన్నమాట.

అతను సీటులో కూచుంటుండగానే ఒక గుమాస్తా కాగితాలన్నీ తెచ్చి ముందు పెట్టాడు.

"నాకు టైము లేదు. ముఖ్యమైన కాగితాలుంటే విడిగా తీసి పట్టుకురా," అన్నాడు రంగారావు, డయిరీ తిరిగేసి యెంగేజిమెంటులు చూస్తూ.

"ఇంకో ఫైలింగు క్లర్కు కావాలనుకున్నాం. వచ్చి కనిపెట్టుకున్నాడు. చూస్తారా?" అన్నాడు గుమాస్తా.

"తరవాత, తరవాత," అన్నాడు రంగారావు పరధ్యానంగా. కాని గుమాస్తా కదలక పోవటం చూసి అది ముఖ్యమై ఉండాలని గ్రహించి "ఏడి? లోపలికి పంపు అప్లికేషను తెచ్చాడా?" అన్నాడు.

మరో క్షణంలో ఒక తెలుగు మనిషి - వాలకం చూస్తేనే స్పష్టంగా తెలుస్తున్నది- రంగారావు యీడువాడే లోపలికొచ్చాడు.

రంగారావు అతని మొహంకేసి చూడకుండానే, "ఏదీ అప్లికేషన్" అన్నాడు ఇంగ్లీషులో.

వచ్చినతను అప్లికేషనిస్తూ తెలుగులో, "మీరు మా ప్రాంతంవారే అని విన్నాను" అన్నాడు.

రంగారావును చెంపమీద కొట్టినట్టయి తల ఎత్తి చూశాడు. తెలుగువాడనే మిష మీదో, తన ప్రాంతం నుంచి వచ్చిన వాడనే మిషమీదో ఉద్యోగం సంపా

---

1. రెండవ ప్రపంచ యుద్ధ ప్రస్తావన (1939-1945)

డించాలని అతని ఉద్దేశమేమో అనే అనుమానం రంగారావు మనస్సులో ఒక్కసారి మెరిసి అతనికి కోపం తెప్పించింది.

"మీదే ఊరు?" అన్నాడు రంగారావు. అంతు చిక్కని కంఠస్వరంతో అతను చెప్పాడు.

రంగారావు మొహాన ఎటువంటి సూచ్చలేదు. "మీ పేరు?" అంటూనే అప్లికేషను కేసి చూసి, "మీ పూర్తి యింటిపేరు?" అని ప్రశ్న వేశాడు.

కొత్త మనిషి అది కూడా చెప్పాడు.

"మీ తండ్రిగారి పేరు?"

దానికీ వచ్చిన మనిషి సమాధానం చెప్పాడు.

రంగారావు తలవంచుకొని అప్లికేషను కేసి చూడసాగాడు.

"మీదేవూరో అడగొచ్చునా?" అన్నాడు ఉద్యోగం కోసం వచ్చినతను చాలా తియ్యగా.

రంగారావు సమాధానం చెప్పలేదు, కాని అప్లికేషను మీద ఒకచోట పెన్సులుతో గుర్తుపెట్టి, "బియ్యే పరీక్షక్కూడా కూర్చొని యీ చిన్న ఉద్యోగం దేనికి? మాకు కావలసింది మామూలు ఫైలింగు క్లర్కు. ఏ స్కూలు ఫైనల్ తప్పినవాడయినా చాలు. జీతంకూడా చాలా తక్కువ," అన్నాడు.

"చాలా చిక్కుల్లో వున్నాను. కుటుంబం కలవాణ్ణి. ఏ కాస్త దొరికినా చాలు. తరవాత మీ అనుగ్రహం వుంటే కాస్త పెద్ద ఉద్యోగం సంపాదించగలనేమో!" అన్నాడు కొత్త మనిషి.

రంగారావు ఒక్కక్షణం ఆలోచించి "అప్లికేషను మీద ఫైలింగు క్లర్కుగా వేసుకోవటమయింది," అని రాసి సంతకం చేసి యీ లోపుగా తన గుమాస్తా తెచ్చిపెట్టిన అర్జంటు కాగితాల మీద సంతకాలు చేసి, జవాబురాసి, టోపీ పట్టుకొని గడియారం చూసుకుంటూ గబగబా వెళ్ళిపోయినాడు.

తన సంగతేమయిందీ తెలియక ఆదుర్దా పడే తెలుగాయన చల్లగా గుమాస్తా దగ్గిరకి వెళ్ళి, "నా అప్లికేషనేమయింది?" అని అడిగాడు. ఆ గుమాస్తా చెయ్యి చాస్తూ, "నీకు ఉద్యోగం యిప్పించేశాను. నాకేమిస్తావు?" అని దక్షిణదేశపు ఇంగ్లీషులో అడిగాడు.

"నిజంగానా?" అన్నాగు తెలుగాయన.

"ఇదుగో ఆఫీసార్డరు టైపు చెయ్యబోతున్నాను. కనీసం అందరికీ టీ ఇప్పించాలి!"

గుమాస్తాలంతా పెద్ద గుమాస్తాను బలపరిచారు. అందరికీ టీలు ఆర్డరు చేయబడినై.

కొత్త గుమాస్తా పేరు కె. వి. ఎస్. డి. పి. రావు అనేది ఆఫీసులో తెలిసింది.

జ్ఞాపకం పెట్టుకునేటందుకు వీలుగా ఎ బీ సీ డీ ఎఫ్. రావని కొందరు నామకరణం చేశారు. మన పాలిటికి అతని పేరు ప్రకాశరావు.

ప్రకాశరావు కొక కుర్చీ చూపించి ఫైల్సూ అవీ పరిచయం చేశాడు. కాని అతనికిప్పుడే పనిలో మునిగిపోవాలని లేదు.

"ఈ రంగారావుడీ వూరూ ఒక వూరే!" అన్నాడు ప్రకాశరావు. అందర్నీ ఆశ్చర్య నిమగ్నుల్ని చెయ్యాలని అతని ఆశ. ఆ సంగతి గ్రహించి ఒకరిద్దరు, "ఓ, రియల్లీ" అన్నారు.

"అట్లాచెప్పు! అందుకనే అంత సులభంగా నీ కార్డరు పడింది!" అన్నాడు మీనన్.

"ఈ రంగారావు బ్రాహ్మడు కాడు!" అన్నాడు ప్రకాశరావు మరో బాంబు వేస్తున్నవాడల్లే.

"నువ్వో?" అన్నాడు మీనన్.

"నేనా? హా! నేను బ్రాహ్మణ్ణే!" అన్నాడు ప్రకాశరావు. ఆ సంగతి వాళ్ళకి సందేహం కలగటమే అతని కాశ్చర్యంగా వున్నట్టు కనపడ్డది.

"మనం బ్రాహ్మలమంతాచేరి ఒక అబ్రాహ్మడి కింద పని చెయ్యాలి సొచ్చిందే! ఎంత అన్యాయం!" అన్నాడు నాయరు.

మీనన్ నాయరుతో ఏకీభవించాడు.

ప్రకాశరావు విజయోత్సాహం పట్ట లేకుండా, "ఇదేం విన్నారు? ఇంకా వినండి!" అన్నాడు.

"చెప్పు చెప్పు!" అన్నా రందరూ.

"ఈ రంగారావు తండ్రి రైతు ...మాపొలం చేసేవాడు!"

ప్రకాశరావు అందరి మొహాల కేసి ఆత్రంగా చూశాడు. ఆ మొహాల్లో అతనికి కావలసిన ఆశ్చర్యం కనిపించలేదు. ఆ మాటే మళ్ళీ చెప్పాడు.

మీనన్ అకస్మాత్తుగా, "రంగారావు గారి తండ్రి పేరేమిటి?" అన్నాడు.

ప్రకాశరావు "నాగభూషణం," అని తడువుకోకుండా చెప్పాడు.

మీనన్ గబగబా రంగారావు గదిలోకి పరిగెత్తి మరో రెండు నిమిషాల్లో బయటి కొచ్చి "నిజమే," అన్నాడు.

"నీ కెట్లా తెలుసు?" అన్నాడు నాయరు.

"రంగారావు కొత్తగా కట్టిన పాలసీ ఆయన బల్లమీదే వుంది," అన్నాడు మీనన్.

"నే నబద్ధం చెప్పటం లేదు!" అన్నాడు ప్రకాశరావు గుమాస్తాల్లో కలిగిన మార్పుకు ఏమాత్రమో కంగారపడుతూ.

"పాపం నీ ప్రారబ్ధం! మీ పొలం చేసిన వాడి కొడుకుకింద ఉద్యోగం చెయ్యాలి సొచ్చింది!"

"మాలో ఓ సామెత వుంది. ఓడలు బళ్ళవుతై, బళ్ళు ఓడలవుతై," అని ప్రకాశరావు ఇంగ్లీషులో అన్నాడు.

"ఆ సామెత కర్థం వున్నట్టే కనపడదేం?" అన్నాడు మరో గుమాస్తా.

"అర్థం యేమిట్లే! యుద్ధం ధర్మమా అంటూ అడ్డమైన వాళ్ళకీ పెద్ద పెద్ద ఉద్యోగాలయినై," అన్నాడు ప్రకాశరావు ఏవగింపుగా.

"అవును మరి మనవంటి చవటల క్కూడా గుమాస్తాగిరీ దొరికింది!" అన్నాడు మీనన్.

తనను చూసి మిగిలిన గుమాస్తాలంతా ఎక్కిరిస్తున్నారేమో అనే సందేహం ప్రకాశరావుకు పొడమ సాగింది.

"పెద్ద ఉద్యోగాలు కావాలంటే శూద్రుడై పుట్టాలి. అందుకనే మీకు నాకూ ఈగతి!" అన్నాడు ప్రకాశరావు అక్కసుతో.

ఆ గుమాస్తాలూ ఒక్కసారిగా నవ్వారు. ప్రకాశరావు మరింత కంగారు పడ్డాడు. వాళ్ళ వూళ్ళో యీ విధంగా మాట్లాడితే యెంతో తెలివి గలవాడను కుంటారు. ఈ పట్టణానికేం తెగులొచ్చినట్టు?

ప్రకాశరావుకు మరో సందేహంకూడా కలగసాగింది. వీళ్ళంతా యీ రంగారావేదో గొప్ప వాడనుకుంటున్నారు. ఇతని పుట్టుపూర్వోత్తరాలు వాళ్ళకేం తెలుసూ? గుమాస్తాలంతా యెగతాళి చేసినా సరే రంగారావును గురించి నిజం చెప్పేయాలనుకున్నాడు.

"మా పొలం చెయ్యటానికొచ్చినప్పుడు రంగారావు తండ్రికి సెంటు పొలం లేదు. పాతికేళ్ళు మా పొలం మీద తెగబడిరాడు. రెండెకరాలు సొంతాన కొనుక్కున్నాడు. ఈ రంగారావుకు బియ్యేదాకా చదువు చెప్పించాడు. ఇవాళ ఈ రంగారావెంత గొప్పవాడయినాడంటే మా చలవే!" అన్నాడు ప్రకాశరావు ఉద్రేకంతో.

కొంచెం సేపెవరూ మాట్లాడలేదు.

"మరి నీకిదేం ఖర్మం? — ఈ గుమాస్తాగిరి" అన్నాడు నాయరు.

"చెవితినిగా? ప్రారబ్ధం! ఓడలూ బళ్ళూ!"

"చాలా ఫైలింగు చెయ్యవలసి ఉంది. కాసె మరి," అన్నాడు మీనన్...

రంగారావు మధ్యాన్నం దాటిన తరవాతగాని ఆఫీసుకు రాలేదు. అతను ఆఫీసుకొచ్చిన అరగంటకల్లా ప్రకాశరావుకు కబురు వెళ్ళింది.

"కూర్చోండి, ప్రకాశరావుగారూ!" అన్నాడు రంగారావు.

ప్రకాశరావు కెందుకో కూర్చోవటానికి భయం వేసింది.

"యుద్ధం ధర్మమా అని నాకీ ఉద్యోగం దొరికింది. ఇంతకు పూర్వం నేను చిప్పచేత పట్టుకొని తిరిగినవాణ్ణి. మేం చాలా పేదవాళ్ళం. మా నాన్న చిన్నతనంలో చాలా స్థితిమంతుడు. ఒళ్ళు కానక అంతా తగలేసుకున్నాడు. మేమంతా పుటుకొచ్చే టప్పటికి అంతా కరా రావుడయి పోయింది. తరవాత మా నాన్న మీ పొలం మక్తాకు

తీసుకున్నాడు. మీ నాన్నగారా పొలంకేసి చూచిన పాపాన పోలేదు. ఊళ్ళో రైతు వొత్తిడి జాస్తిగా ఉండడం మూలాన మా నాన్న చెవులుపిండి మీ నాన్నగారు గడ్డి కూడా పూర్తిగా దక్కనీకుండా మక్తా దిగించాడు. మా నాన్నగారు కారం మెతుకులు తిని, మా కడుపులుమాడ్చి యిరవైయేళ్ళలోగా రెండెకరాలు కొనుక్కోగలిగాడు. కాని ఆయన తిండికి మాడుతూ అనేక రోగాలు తెచ్చుకుంటూ పసరు వైద్యాలు చేసుకుంటూ గాలికి పెరిగాడు. నా చదువంతా కులాభిమానుల చందాలతో సాగింది. నా తమ్ము డిప్పటికీ ఎందునా కాకుండా తిరుగుతున్నాడు. ఒకరిద్దరు పొలాలు చేసుకుంటున్నారు. ఈ ఉద్యోగం దొరికినంత మాత్రాన నేను గొప్ప వాణ్ణయి పోలేదు. మీరంటే పెద్ద కుటుంబంవారు. ఇవాళ చితికిపోయినా మీ గొప్పతనం తగ్గదు. మీరు నాకింద పనిచెయ్యటం నాకేమీ మనస్కరించదు. దాన్ని గురించే పొద్దుటి నుంచీ విచారిస్తున్నాను....ఏదైనా మీకు తగిన ఉద్యోగం వెతుక్కోండి. నా చాతయిన శిఫార్సు చేస్తాను. మరోడిచేత అవసరమైతే చేయిస్తాను. ఇది మరీ తక్కువ ఉద్యోగం—మీనన్, రావుగారి నౌకరి తాలూకు ఆపీ సార్డరు పట్టుకురా, కాన్సిల్ చేసేస్తాను!" అన్నాడు రంగారావు.

—నవోదయ, జనవరి 20, 1946 సం. 1, 1.